క్లుప్తంగా

రేపు ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

కడ్తాల్: ఈ నెల 11వ తేదీన లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ఆధ్వర్యంలో కల్వకుర్తి నియోజకవర్గంలోని ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్నట్లు లయన్స్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లుగౌడ్, పీఆర్‌ఓ పాషా శనివారం ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు.

లయన్స్ ఎంపిక చేసిన ఉపాధ్యాయులు వీరే..

మల్లయ్య (ఎస్‌జీటీ, పిల్లిగుండుతండా), భీముడు (జెడ్పీహెచ్‌ఎస్, పీఈటీ ముద్విన్), బాలేశ్వరరావు (ఎస్‌ఎ, రావిచేడ్ ఉన్నత పాఠశాల), భార్గవి(జెడ్పీహెచ్‌ఎస్ బాలికల ఉన్నత పాఠశాల ఆమనగల్లు), వెంకటయ్య(ఎంపీపీఎస్, ఆమనగల్లు), పద్మప్రియా (ఎస్జీటీ, పోలేపల్లి),శంకర్ (ఎస్‌ఎ, పడకల్ ఉన్నతపాఠశాల), సురేశ్‌కుమార్‌రెడ్డి (ఎస్జీటీ, ఎంపీపీఎస్, దేవునిపడకల్), రవికుమార్(జెడ్పీహెచ్‌ఎస్, వెల్దండ), గోపాల్ (ఎస్జీటీ, అజిలాపూర్), కవిత(ఎస్జీటీ,చంద్రయాన్‌పల్లి)సుజాత(జెడ్పీహెచ్‌ఎస్, ఇర్విన్)తో పాటు తదితరులున్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న నాయకులు

కడ్తాల: మక్తమాధారం గ్రామంలో కంఠమహేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి, గౌడ సంఘం నాయకులు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో శనివారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఆలయాల నిర్మాణంతో గ్రామాల్లో భక్తిభావం పెంపొందుతుందని, ఆలయ నిర్మాణానికి ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. సర్పంచ్ సులోచన, ఎంపీటీసీ మంజుల, మార్కెట్ డైరెక్టర్ నర్సింహగౌడ్, నరేశ్‌గౌడ్, చెన్నయ్య, యాదగిరి, మల్లేశ్, రమేశ్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ నేతలకు శిక్షణా సదస్సు



వంశీచంద్‌రెడ్డితో నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు

కడ్తాల్: హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లి ఆర్టీసీ కల్యాణ మండపంలో శనివారం జరిగిన కాంగ్రెస్ పార్టీ మండల, బ్లాక్ కాంగ్రెస్ నాయకులతో సదస్సు నిర్వహించారు. సమావేశానికి కల్వకుర్తి నియోజకవర్గంలోని ఆమనగల్లు, కల్వకుర్తి బ్లాక్ అధ్యక్షుడు నర్సింహ, విజయ్‌కుమార్‌రెడ్డితో పాటు కడ్తాల్, తలకొండపల్లి మండలాల అధ్యక్షులు బీచ్యానాయక్ , ప్రభాకర్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతానికి సంబంధించిన అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సదస్సుకు పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డితో పలువురు కాంగ్రెస్ నాయకులు హాజరైనట్లు వారు తెలిపారు.

తెలంగాణ యాసకు వన్నె తెచ్చిన కాళోజీ

టీఎస్ఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్



తలకొండపల్లి: ప్రజాకవి కాళోజీ నారాయణరావు మహోన్నత వ్యక్తి అని టీఎస్ఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్ అన్నారు. ఆయన స్ఫూర్తి తెలంగాణ సాధన, ప్రగతిలో ఇమిడి ఉందని పేర్కొన్నారు. తెలంగాణ భాషకు అస్తిత్వ స్పృహను పెంచడంలో కాళోజీ కీలక పాత్ర పోషించారని కొనియాడా రు. వివక్ష లేని సమాజ స్థాపన కోసం అనేక రచనలు చేశారని గుర్తు చేశారు. పుట్టుక నీది, చావు నీది, బతుకంతా దేశానిది అన్న కాళోజీ సూక్తిని ఆయన గుర్తుచేశారు. మనిషికి ప్రకృతికి మధ్య ఉన్న అవినాభావ సంబంధాన్ని తన సాహిత్యం ద్వారా సున్నితంగా విశ్లేషించారని, తెలంగాణ యాసకు వన్నె తెచ్చారని ప్రసంశించారు.

కేటీఆర్‌ను కలిసిన జైపాల్‌యాదవ్



మంత్రి కేటీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, నాయకులు

ఆమనగల్లు: విదేశీ పర్యటన ముగించుకుని వచ్చిన మంత్రి కేటీఆర్‌ను మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి హైదరాబాద్‌లోని సచివాలయంలో శనివారం కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, పలువురు నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాస్‌యాదవ్, తలకొండపల్లి జెడ్పీటీసీ సభ్యులు ఉప్పల వెంకటేశ్, ఆమనగల్లు మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

వడగళ్ల బాధితులకు చెక్కులు రెడీ

- ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి ప్రయత్నం సఫలం
- రూ.10 వేల చొప్పున పరిహారం
- రెండు, మూడు రోజుల్లో పంపిణీ
- లబ్ధిదారులకు 'గృహలక్ష్మి'



మంచాలలో బీటీ రోడ్డు నిర్మాణం పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

యాచారం: వడగండ్ల వానతో నష్టపోయిన బాధితులను కాస్త ఆలస్యమైనా ప్రభుత్వం ఆదుకునేందుకు ముందుకు వచ్చింది. మంతన్‌గౌరెల్లి గ్రామంలో మార్చి నెలలో కురిసిన వడగళ్ల వర్షానికి దెబ్బతిన్న రేకుల ఇళ్లకు పరిహారం మంజూరైంది. మంతన్‌గౌరెల్లి, కేసీతండాలో వడగండ్ల వల్ల ఇళ్ల పైకప్పుకు రంధ్రాలు పడ్డాయి. ఈ రెండు తండాల్లో మెజార్టీగా గిరిజనులే ఉన్నారు. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇంటికి మరమ్మతులు చేసుకునే ఆర్థిక స్తోమత కూడా వీరికి లేదు. పైకప్పు దెబ్బతినడం వల్ల చిన్న వర్షానికే ఇళ్లలోకి నీరు చేరుతోంది. వడగళ్లు కురిసిన మరుసటి రోజే ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి గ్రామాన్ని సందర్శించి బాధితులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. పరిహారం చెల్లింపులో ఆలస్యం కావడంతో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కర్నాటి రమేశ్‌గౌడ్ ఇటీవల ఎమ్మెల్యే, మంత్రి హరీశ్‌రావుతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. స్పందించిన మంత్రి వెంటనే అధికారులతో మాట్లాడి రూ. 53,11,500 నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఎమ్మెల్యే చొరవతో..

వడగళ్ల బాధితులకు ఎమ్మెల్యే చెక్కులు అందజేయనున్నారు. దెబ్బతిన్న ఇంటికి రూ.10 వేల చొప్పున పరిహారం అందజేస్తారు. రెండు, మూడు రోజుల్లో కిషన్‌రెడ్డి సమయాన్ని తీసుకుని చెక్కులు ఇవ్వనున్నారు. ఎమ్మెల్యే సాక్షితో మాట్లాడుతూ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి నిధులు మంజూరు చేయించానని తెలిపారు. అలాగే ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి 3 వేల గృహలక్ష్మి పథకం ఇళ్లు మంజూరైనట్లు పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లో అధికారుల సర్వే ప్రకారమే లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు ఆయన వెల్లడించారు.

సంక్షేమంతో చేయూత

మంచాల: నియోజకవర్గ అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నామని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. శనివారం మంచాల మండలంలోని లింగంపల్లి, మంచాల, జాపాల, ఆరుట్ల, పటేల్ చెరువు తండా, చిత్తాపూర్, తాళ్లపల్లి గూడ గ్రామాల్లో రూ.12.83 లక్షలతో పలు అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని తెలిపారు. ఆసర పథకం, కల్యాణలక్ష్మి, గృహలక్ష్మి, రైతుబంధు, రైతు బీమా, కేసీఆర్ కిట్, రైతు రుణమాఫీ, కులవృత్తుల వారిగా ఆర్థిక రుణాలు పంపిణీ, దళిత బంధు, బీసీ బంధు వంటి పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. సంక్షేమ పథకాలతో చేయూత నందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంచాల ఎంపీపీ నర్మద, మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య, పీఏసీయస్ చైర్మన్ పుల్లారెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ఆమనగల్లు: మాడ్గుల మండలం ఆర్కపల్లి గ్రామానికి చెందిన షేక్ అజ్జుపాషా, మరియమ్మల ఇళ్ల నిర్మాణానికి ఉప్పల చారిటబుల్ ట్రస్టు చేయూతనందించింది. ఇళ్ల నిర్మాణానికి కావాల్సిన సామగ్రిని ట్రస్టు చైర్మన్ వెంకటేశ్ సమకూర్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు బిక్కుగౌడ్, జంగయ్య, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

'రాధాకృష్ణ' చేయూత

కడ్తాల్: మండలంలోని కర్కల్‌పహాడ్ గ్రామానికి చెందిన అంజమ్మ, నార్లకుంటతండాకు చెందిన హస్లీ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, శనివారం ఆయా గ్రామాల్లో పర్యటించి, మృతుల కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలకు రూ.5 వేల చొప్పున ఇరు కుటుంబాలకు రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. పరామర్శించిన వారిలో సర్పంచ్ పూజదేవానాయక్, ఉప సర్పంచ్ రాములునాయక్, నాయకులు హున్యా, యాదయ్య, బీచ్యా, రాజు, హరి, బాల్‌రాజ్, బాలేందర్, రవి, జీవన్, వీరయ్య, కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

తలకొండపల్లిలో...

తలకొండపల్లి: గట్టుఇప్పలపల్లికి చెందిన పుల్లమ్మ (59) అనారోగ్యంతో శనివారం మృతి చెందింది. బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు రేణురెడ్డి, సర్పంచ్ జయమ్మ, వెంకటయ్యలు మృతురాలి కుటుంబసభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. వ్యక్తిగతంగా రేణురెడ్డి రూ.3,000, సర్పంచ్ రూ.2,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగమణి, లింగం గౌడ్, మాజీ ఉప సర్పంచ్ చంద్రమౌళి, రాజశేఖర్ పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న దశరథ్

ఘనంగా కమలా కాళీ బోనాలు



బోనాల ఉత్సవ వేడుకల్లో సర్పంచ్, మహిళలు

తలకొండపల్లి: మండలంలోని చంద్రధనలో శనివారం కమలా కాళీ బోనాలను ఘనంగా నిర్వహించారు. పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో బోనాల వేడుకలు జరిపారు. పప్పు బెల్లంతో వండిన నైవేద్యాన్ని అమ్మవారికి సమర్పించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా శివ సత్తుల ఆటపాట, పోతురాజులు విన్యాసాలు పలువురిని అలరించాయి. సర్పంచ్ కుమార్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు రాజు, దామోదర్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ ప్రసాద్, యాదయ్య, రామాకృష్ణారెడ్డి, యాదగిరి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

నేడు సుద్దపల్లిలో బోనాలు

ఆమనగల్లు: మాడ్గుల మండలం సుద్దపల్లి గ్రామంలో ఆదివారం బోనాల పండుగను నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ యాచారం వెంకటేశ్వర్లుగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ఈ నెల 11న వన మహోత్సవం కార్యక్రమం నిర్వహించాలని కోరారు.

నేడు రక్తదాన శిబిరం

తలకొండపల్లి: మండల పరిధిలోని రామక్రిష్టాపురంలో ఇండియన్ రెడ్ క్రాస్ సోసైటీ సభ్యులు, శతాబ్ది టౌన్‌షిప్ చైర్మన్ కాసు శ్రీనివాసురెడ్డి, బ్లడ్ బ్యాంక్ డైరెక్టర్ అంజిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు మండల కోఆప్షన్ ఇమ్రాన్ శనివారం తెలిపారు. ఉదయం 9 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి పరిసర గ్రామాల యువకులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నేడు పార్వతీపరమేశ్వరుల కల్యాణం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంలోని శ్రీభద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయంలో ఆదివారం ఉదయం 11 గంటలకు పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఉదయం ఆరు గంటల నుంచి గణపతిపూజ, నవగ్రహ మండపారాధన, హోమం, గజారోహణం, రుద్రాభిషేకం అనంతరం పార్వతిపరమేశ్వరుల కల్యాణాన్ని నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

రేపు సర్వసభ్య సమావేశం

అబ్దుల్లాపూర్‌మెట్: అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మంచిరెడ్డికిషన్‌రెడ్డి హాజరు కానున్నారని తెలిపారు. హయత్‌నగర్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో జరిగే ఈ సమావేశానికి సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

బీజేపీ నిరసన

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం మేడిగడ్డతండా నుంచి శంకరకొండతండా రోడ్డులో బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరైనా పనులు చేపట్టడం లేదని ఆమనగల్లు పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. పట్టణంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, మేడిగడ్డతండా ప్రజలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం రాజీవ్ చౌరస్తా వద్ద ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దుర్గయ్య, మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు శ్రీకాంత్‌సింగ్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు కండెసాయి, పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

బూత్ కమిటీల నియామకం

ఆమనగల్లు మండలంలోని పోలేపల్లి, కొత్తకుంటతండా, అంకమోనికు ంటకు చెందిన బీజేపీ బూత్ కమిటీలను నియమించారు. బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి ప్రభాకర్, బీజేవైఎం మండల కార్యదర్శి శ్రీనివాస్ ఆధ్వర్యంలో బూత్ కమిటీలను నియమించారు. పోలేపల్లి, కొత్తకుంటతండా బూత్ బీజేపీ ప్రధాన కార్యదర్శులుగా కట్ట సైదులును ఎన్నుకున్నారు.

69వ రోజుకు చేరిన దీక్షలు

తలకొండపల్లి: గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని జేఏసీ ఆధ్వర్యం ఆందోళనలు కొనసాగిస్తున్నారు. మండల కేంద్రం సాధనే లక్ష్యంగా చేస్తున్న రిలే నిరాహార దీక్షలు శనివారానికి 69వ రోజుకు చేరుకున్నాయి. రోజులు గడుస్తున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటన రాకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు. తమ గోడు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదని వాపోయారు. మండలముగా ప్రకటించి ప్రజల బాధలు తీర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు, దామోదర్, శ్రీను, లక్ష్మణరావు, వెంకటేశ్, నర్సింహ, మల్లేశ్, పవన్, లింగం, కృష్ణయ్య, చెన్నయ్య, సాయిరెడ్డి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజీమార్గమే రాజమార్గం



ఆమనగల్లు కోర్టు ఆవరణలో లోక్ అదాలత్ కేసులను పరిశీలిస్తున్న జడ్జి స్వరూప



ఇబ్రహీంపట్నం కోర్టు ఆవరణలో లోక్ అదాలత్ కేసులను పరిశీలిస్తున్న న్యాయమూర్తులు

ఆమనగల్లు: కోర్టు కేసుల్లో ఇరువర్గాలు రాజీపడటం రాజమార్గమని ఆమనగల్లు జూనియర్ సివిల్ జడ్జి స్వరూప అన్నారు. కక్షిదారులు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆమనగల్లు కోర్టు ప్రాంగణంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. లోక్ అదాలత్‌లో 124 క్రిమినల్ కేసులు, 2,207 ఈ పిటీ కేసులు రాజీ అయ్యాయి. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ఇరువర్గాలు రాజీపడటం కోసం కోర్టులు ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయని తెలిపారు. రాజీపడే అవకాశం ఉన్న కేసుల్లో ఇరువర్గాలు మాట్లాడుకుని రాజీ చేసుకోవడం మంచిదని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ బాల్‌రాం, లోక్ అదాలత్ సభ్యులు ఆంజనేయులు, ఏపీపీ కార్తీక్, సీనియర్ న్యాయవాదులు లక్ష్మణశర్మ, జగన్, రామకృష్ణ, మల్లేశ్, మధు, గణేశ్, జగన్, సంతోష్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

1,258 కేసుల పరిష్కారం

ఇబ్రహీంపట్నం: స్థానిక న్యాయస్థానం ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ మెగాలోక్ అదాలత్‌లో 1,258 కేసులను పరిష్కరించారు. ఇబ్రహీంపట్నం పరిధిలో నమోదైన 339, మంచాల పరిధిలో 286, యాచారం- 318, ఆదిభట్ల- 101, మాడ్గుల- 160, ఫార్మాసిటీ పరిధిలో ఫైల్ అయిన 54 కేసుల్లో కక్షిదారులు రాజీపడ్డారు. ఈ కార్యక్రమంలో ఆయా న్యాయస్థానాల జడ్జిలు, పలువురు న్యాయవాదులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

అనాథ వృద్ధులకు అండగా నిలుస్తాం

బీఆర్‌ఎస్ నేత మోహిజ్‌పాష



వృద్ధులకు అన్నదానం చేస్తున్న బీఆర్‌ఎస్ నేత మోహిజ్‌పాష

ఇబ్రహీంపట్నం: అనాథ వృద్ధుల సమక్షంలో జన్మదిన వేడుకలు జరుపుకోవడం ఎంతో సంతృప్తినిచ్చిందని బీఆర్‌ఎస్ జిల్లా నేత ఎండీ మోహిజ్‌పాష అన్నారు. వినోబానగర్‌లోని మాతాపితరుల సేవా సదనంలో శనివారం అన్నదానం చేశారు. అనాథలతో కలిసి కేక్ కట్‌చేశారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాతాపితరుల సేవా సదనంలోని వృద్ధులకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కో ఆప్షన్ మెంబర్ సెహనాత్‌బేగం, బీఆర్‌ఎస్ నాయకుడు గరిగే శేఖర్ తోపాటు పలువురు పాల్గొన్నారు.

నత్తనడకన రహదారి విస్తరణ



వాహనాలు వెళ్తుండగా దుమ్మురేగుతున్న తుర్కయంజాల్ రోడ్డు

తుర్కయంజాల్: సాగర్ రహదారి నుంచి తుర్కయంజాల్ మీదుగా నాదర్‌గుల్ వరకు చేపడుతున్న రోడ్డు విస్తరణ పనుల్లో జాప్యం కొనసాగుతుంది. దీంతో గుంతలమయంగా మారిన రోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా మారిందని వాహనదారులు వాపోతున్నారు. రూ.16 కోట్ల అంచనా వ్యయంతో చేపడుతున్న ఈ పనుల్లో కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పాటు అధికారుల అలసత్వం తోడవ్వడంతో పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. రోడ్లకు ఇరువైపులా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించాలని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆదేశించినా అధికారుల్లో చలనం కనిపించడం లేదు. అధికారులు స్పందించి రోడ్డు విస్తరణ పనులను వేగవంతం చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై సాక్షి మున్సిపల్ కమిషనర్ సీ.హెచ్. శ్రీకాంత్‌ను వివరణ కోరగా నాదర్‌గుల్ వైపు నుంచి పనులు కొనసాగుతున్నాయని, పనులు వేగంగా జరిగేలా చర్యలు చేపడుతామని తెలిపారు.

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాలు



విరాళం అందజేస్తున్న లక్ష్మీనర్సింహారెడ్డి

కడ్తాల్: గ్రామదేవతల ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సర్పంచ్‌ల సంఘం రాష్ట అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి తెలిపారు. శనివారం ఉత్సవాల ఏర్పాట్లును ఆయన పరిశీలించారు. అనంతరం లక్ష్మీనర్సింహారెడ్డి మాట్లాడుతూ ఈ నెల 10న బీరప్ప, పెద్దమ్మ, ఈదమ్మ, మైసమ్మ, మడేలు బోనాలు, 11న పోచమ్మ బోనాలు 12వ తేదీ రేణుక ఎల్లమ్మ బోనాలను వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. తెలంగాణ సాంస్కృతి, సంప్రదాయాలను చాటే బోనాల ఉత్సవాలను ఐక్యమత్యంతో నిర్వహించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా పోచమ్మ ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులకు ఆయన రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పోచమ్మ ఆలయ కమిటీ చైర్మన్ సత్యంయాదవ్, సభ్యులు రాములు, మల్లేశ్‌గౌడ్, రాంచందర్ నాయక్, యాదయ్య, నర్సింహ, రవి తదితరులు పాల్గొన్నారు.

భక్తి భావంతో ముక్తి

ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే, కేశవరెడ్డి, తదితరులు

తలకొండపల్లి: భక్తితో ముక్తి మోక్షం లభిస్తుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. ప్రతిఒక్కరూ భక్తి మార్గంలో పయనిస్తూ ఆధ్యాత్మిక మార్గాన్ని ఎంచుకోవాలని సూచించారు. శ్రావణ శనివారాన్ని పురస్కరించుకొని, పీఏసీఎస్ చైర్మన్ కేశవరెడ్డి ఆధ్వర్యంలో మండల పరిధిలోని హనుమాన్ ఆలయంలో యజ్ఞ హోమాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేతో పాటు, శతాబ్ది టౌన్‌షిప్ చైర్మన్ శ్రీనివాసురెడ్డి ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు. స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు పూర్ణాహూతితో స్వాగతం పలికి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కన్నుల పండువగా కొనసాగిన ఈ కార్యక్రమానికి పరిసర ప్రాంతాలతో పాటు, షాద్‌నగర్, కేశంపేట్, జడ్చర్ల, తదితర పట్టణాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కేశవరెడ్డి, మండల కో ఆప్షన్ ఇమ్రాన్, సర్పంచ్‌లు ఎల్లమ్మ, తిరుపతయ్య, శ్రీశైలం, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

హయత్‌నగర్: పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీలోని తట్టిఅన్నారం శ్రేయాస్ ఇంజనీరింగ్ కళాశాలలో 9వ గ్రాడ్యుయేషన్ డే శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హెచ్‌ఆర్‌జెన్‌సీ మేనేజర్ జితేంద్ర, హైరింగ్ యూనివర్సిటీ ప్రతినిధి అభిషేక్ ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి క్రమశిక్షణతో చదివితే ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడుతారని తెలిపారు. టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని సూచించారు. కళాశాల చైర్మన్ వినయ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్యదర్శి రవింద్రనాథ్, వైస్ చైర్మన్ హృదయ్‌రెడ్డి, ప్రిన్సిపల్ సాయి సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు ప్రత్యామ్నాయం లేదు

ఆమనగల్లు: బీఆర్‌ఎస్ విజయాన్ని ఏ శక్తి అడ్డుకోలేదని ఆమనగల్లు మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పత్యానాయక్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా పార్టీలో చేరుతున్నారని తెలిపారు. బీజేపీ, వివిధ పార్టీల నుంచి సుమారు 100 మంది నాయకులు, కార్యకర్తలు పత్యానాయక్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌కు ప్రత్యామ్నాయం లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు వెంకటేశ్, సత్యం, ఆనంద్, రఘు, ముక్కరి కృష్ణయ్య పాల్గొన్నారు.

బీసీ బంధు కాదు.. బీఆర్‌ఎస్ బంధు

తలకొండపల్లి: అర్హులైన నాయీబ్రాహ్మణులందరికీ బీసీ బంధు పథకాన్ని ఇవ్వాలని ఈ సంఘం మండలాధ్యక్షుడు నర్సింహ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం నాయీ బ్రాహ్మణులను విస్మరిస్తోందని ఆరోపించారు. బీసీ బంధు కాస్తా బీఆర్‌ఎస్ బంధుగా మారిందని మండిపడ్డారు. కొందరు నాయకులు సూచించిన వారికే ఈ పథకాన్ని ఇస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అర్హులకు బీసీ బంధుతో పాటు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సంఘం గౌరవ అధ్యక్షుడు నీలకంఠం విష్ణు, ప్రధాన కార్యదర్శి చెన్నయ్య, నర్సింహ, బిక్షపతి, అంజయ్య, మహేష్, వెంకటయ్య, పాండు పాల్గొన్నారు.

రూ.8.16 కోట్లతో 'ఉపాధి'

ఎంపీపీ కృపేశ్

ఇబ్రహీంపట్నం: రూ. 8.16 కోట్లతో ఉపాధి హామీ పనులను ఇబ్రహీంపట్నం మండలంలో చేసినట్లు ఎంపీపీ కృపేశ్ తెలిపారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 15వ విడత సామాజిక తనిఖీల్లో భాగంగా శనివారం కృపేశ్ అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం ద్వారా కూలీలకు కల్పించిన పనులు, ఖర్చులు, ఫారెస్టు, పంచాయతీరాజ్ శాఖలు చేపట్టిన పనుల తనిఖీ జరుగుతున్నట్లు తెలిపారు. కూలీలకు రూ. 4.39 కోట్లు, సామగ్రి కోసం 3.76 కోట్లకుపైగా ఖర్చులు చేసినట్లు తెలిపారు. దీనిపై సామాజిక బృందం గ్రామాల్లో చేపట్టిన పనులను పరిశీలిస్తుందని పేర్కొన్నారు. ఎంపీడీఓ వెంకటమ్మ, ఏపీఓ తిరుపతాచారిలు పాల్గొన్నారు.